క్లుప్తంగా

సమ్మెను జయప్రదం చేయండి

నెహ్రూసెంటర్: బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 20వ తేదీన కార్మిక సంఘాల ఆధ్వర్యంలో చేపట్టనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకుల రాజు, కుంట ఉపేందర్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో సమ్మె కరపత్రాలను శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు రామ్మూర్తి, నాగన్న, యాకయ్య, వెంకన్న, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎలక్ట్రానిక్ కాంటా పరిశీలన

కేసముద్రం: మున్సిపాలిటీ కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ ఆవరణలోని ఎంఎల్ఎస్ పాయింట్‌ను, జిల్లా తూనికల కొలతల శాఖ అధికారి ఎస్.విజయ్‌కుమార్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కాంటా సక్రమంగా పనిచేస్తున్నట్లు ఆయన తెలిపాడు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

నెల్లికుదురు: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని ఎంఈఓ రాందాస్ అన్నారు. మండలంలోని వివిధ గ్రామాల ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు శుక్రవారం యూనిఫాం క్లాత్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎంలు, కోఆర్డినేటర్ సుధాకర్, సీఆర్పీలు కవిత, వీరస్వామి, భాస్కరరావు, ఐఆర్పీ యాకయ్య పాల్గొన్నారు.

విద్యుత్ వారోత్సవాలు

తొర్రూరు రూరల్: విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా ఉండాలంటే రైతులు, వినియోగదారులు విద్యుత్ సరఫరాపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని తొర్రూరు విద్యుత్‌శాఖ డివిజనల్ ఇంజనీర్ మధుసూదన్ అన్నారు. శుక్రవారం మండలంలోని నాంచారీ మదూరు గ్రామ రైతు వేదికలో విద్యుత్ వారోత్సవాలను పురస్కరించుకొని అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో విద్యుత్ అధికారులు పెద్దిరాజం, చలపతిరావు, ఏఈలు, ఇతర సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ప్రపంచ తెలుగు సాహితీ సంబురాలకు ఆహ్వానం



గార్ల: శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో ఏపీ రాష్ట్రంలోని ఏలూరులో ఈనెల 10, 11 తేదీలలో నిర్వహించే ప్రపంచ తెలుగు సాహితీ సంబురాలకు గార్లకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు పంజాల ఐలయ్యకు ఆహ్వానం అందింది.

నీళ్లు రావడం లేదని ఆందోళన



గూడూరు: మండలంలోని గుండెంగ, శివారు అజ్మీరతండా, దస్రుతండాలకు నాలుగు రోజులుగా మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో తండావాసులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అలాగే చేతిపంపులో నీరు రాకపోవడంతో శుక్రవారం మహిళలు ఖాళీ బిందెలతో ఆందోళన వ్యక్తం చేశారు. గుండెంగ కార్యదర్శితో తమ గోడు చెప్పుకున్నారు. తాగునీరు అందించాలని నినాదాలు చేశారు.

గ్రీన్‌ఫీల్డ్ హైవేపై వంతెన నిర్మించాలని దీక్ష



కురవి: మండలంలోని మోద్గులగూడెం శివారు బేగావత్ తండా గ్రామ శివారులో గ్రీన్‌ఫీల్డ్ హైవేపై నూతన వంతెనను నిర్మించాలని డిమాండ్ చేస్తూ తండా వాసులు శుక్రవారం రిలే నిరహార దీక్షలను ప్రారంభించారు. గ్రీన్ ఫీల్డ్ హైవే పనులను తండవాసులు అడ్డుకున్నారు. ప్రజలు రోడ్డుకు అవతలికి వెళ్లాలంటే ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ బేగావత్ బాలాజీ, బేగావత్ నరేందర్, శంకర్, రమేశ్, అజయ్, రాములు, సాగర్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపైనే బోర్లు..

- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు

మహబూబాబాద్: జిల్లా కేంద్రంలో కొంత మంది షాపుల యజమానులు రోడ్లపైనే బోర్లు వేస్తున్నారు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దర్జాగా రోడ్లపై అందరూ చూస్తుండగానే బోర్లు వేస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. మామూళ్లు తీసుకుని వారిని వదిలేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇళ్లకు సంబంధించిన చిన్న పైపులైన్ రోడ్డు నుంచి వేయాలన్నా అనుమతి తీసుకోవాల్సిందే లేకుంటే తక్షణమే చర్యలు తీసుకుంటున్నారు. కానీ బోర్లు వేసే వారిపై మాత్రం చర్యలు తీసుకోవడంలేదని ప్రజలు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నిత్యం రద్దీగా..

జిల్లా కేంద్రంలో కొంత మంది షాపుల యజమానులు ప్రధాన సెంటర్‌లలోని రోడ్లనే బోర్లు వేస్తున్నారు. జిల్లా కేంద్రంలో ఉద్యోగ వ్యాపార, వివిధ పనులతో నివాసం ఉండే వారితో కలిపితే లక్ష జనాభా దాటుతుంది. పలు పనుల నిమిత్తం జిల్లా కేంద్రానికి రోజు వచ్చే వారి సంఖ్య ప్రతి రోజు వేల సంఖ్యలో ఉంటుంది. నిత్యం రద్దీగా ఉంటే నెహ్రూ సెంటర్‌తోపాటు పలు సెంటర్‌లో రోడ్లపై బోర్లు వేస్తున్నారు. కొంత మంది ఏకంగా డ్రెయినేజీలో కూడా బోర్లు వేసి కాల్వ దాని పక్క నుంచి నిర్మాణం చేస్తున్నారు. మార్వాడీ బజార్‌తోపాటు వెంకటేశ్వర్ల బజార్‌తోపాటు పలు వార్డుల్లో కూడా ఇదే పరిస్థితి ఉంది. నెహ్రూసెంటర్ నుంచి ముత్యాలమ్మ గుడి సెంటర్ నిత్యం రద్దీగా ఉంటుంది.

అనుమతి లేకుండానే..

బోరు వేయాలంటే తప్పనిసరిగా భూగర్భజల శాఖ అధికారుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి. కాని ఎలాంటి అనుమతి లేకుండానే బోర్లు వేస్తున్నారు. కొంత మంది అనుమతి లేకుండా దర్జాగా రోడ్లపైనే బోర్లు వేస్తున్నారు. మున్సిపల్, భూగర్భ జల శాఖతో సంబంధిత అధికారులు మాత్రం ఆ విషయంలో పట్టించుకోవడం లేదు. ముందుగానే అధికారులకు డబ్బులు ఇచ్చి బోర్లు వేసుకుంటున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. వెంటనే ఆ రోడ్లపై వేసిన బోర్లు మూసి వేయాలని వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



జిల్లా కేంద్రంలోని మోడల్ మార్కెట్ ఎదుట రోడ్డుపై ఇటీవల వేసిన బోరు



మార్వాడి బజార్‌లో డ్రెయినేజీలో వేసిన బోరు

రామానుజాచార్యుల తిరునక్షత్ర పూజలు



పూజలో పాల్గొన్న భక్తులు

మహబూబాబాద్ రూరల్: త్రిదండి రామానుజాచార్యుల తిరునక్షత్రోత్సవం (జన్మదినోత్సవం) పూజలను మానుకోటలోని శ్రీవేణుగోపాల స్వామివారి దేవాలయంలో శుక్రవారం భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఇందులో భాగంగా స్వామివారి ఉత్సవమూర్తి విగ్రహానికి అర్చకులు శాస్త్రోక్తంగా ప్రత్యేక అభిషేకాలు, పూజాకార్యక్రమాలు జరిపారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశాక భక్తులకు తీర్థప్రసాదాలతోపాటు విసనకర్రలు, పూలు, పండ్లు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు రమణయ్య, చాపల ఉషాబాపు రెడ్డి, పులి యాదమ్మ, పరకాల పద్మ, మల్లం సువర్ణ, సింగం చంద్రకళ, కైరంకొండ లలిత, మొగిలి ప్రసాదరెడ్డి, కొల్లూరు రవికుమార్, సింగం మనోహర్, పరకాల ఉపేందర్ రెడ్డి, బవిరిశెట్టి శ్రీనివాస్, మేక ప్రవీణ్ రెడ్డి, జూలకంటి ప్రభాకర్ పాల్గొన్నారు.

హమాలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

చిన్నగూడూరు: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వేలాదిమంది హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి రవి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద కార్మికులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. హమాలీల శ్రమను గుర్తించి పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యంతోపాటు కనీస పెన్షన్ పద్ధతిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హమాలీ యూనియన్ నాయకులు నర్సయ్య, కోల వెంకన్న, దుండి వీరన్న, బత్తెం వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి



ఆందోళన చేస్తున్న గ్రామస్తులు, నాయకులు

కురవి: అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ అఖిలపక్షం ఆధ్వర్యంలో తట్టుపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని నినాదాలు చేశారు. అఖిలపక్షం నాయకులు స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. భూమి ఉండి, వేరే గ్రామాల్లో ఉన్న వ్యక్తుల పేర్లు తీసేసి గ్రామంలో నివసిస్తున్న అర్హులకు ఇళ్లు మంజూరు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన తీవ్రం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అఖిలపక్షం నాయకులు డీవై గిరి, మాజీ ఎంపీటీసీ పోతుగంటి వెంకన్న, అంతటి సురేష్, కొత్త ప్రభాకర్, బోనాల రవి, మధనాచారి పాల్గొన్నారు.

ప్రారంభోత్సవాలు చేయడం సిగ్గుచేటు



మాట్లాడుతున్న శ్రీనివాస్

తొర్రూరు/పెద్దవంగర: బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో మంజూరైన పనులను కాంగ్రెస్ ఖాతాలో వేసుకొని ప్రారంభోత్సవాలు చేసుకోవడం సిగ్గుచేటని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్, హనుమాండ్ల ప్రదీప్ రెడ్డి అన్నారు. శుక్రవారం తొర్రూరు డివిజన్ కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో పార్టీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు కృషితో తొర్రూరు పెద్ద చెరువు ప్రాంతంలో మిని ట్యాంక్ బండ్ నిర్మాణానికి టీయూఎఫ్ఐడీసీ నిధుల నుంచి రూ.3.50 కోట్లు మంజూరు అయినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌రావు, నాగరాజు, ఉప్పలయ్య, వెంకన్న, కుమారస్వామి, రవి, శంకర్ పాల్గొన్నారు.

వేసవి ఖోఖో శిక్షణ శిబిరం ప్రారంభం



క్రీడాకారులను సన్మానిస్తున్న నిర్వాహకులు

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మండలంలోని కంబాలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వేసవి ఖోఖో శిక్షణ శిబిరాన్ని జిల్లా యువజన క్రీడల అధికారి జ్యోతి శుక్రవారం ప్రారంభించారు. ఈసందర్భంగా జ్యోతి మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని, కంబాలపల్లి గ్రామం ఖోఖోకు పుట్టినిల్లని కొనియాడారు. సింగపూర్ నగరంలో జరుగనున్న 42 కిలోమీటర్ల మారథాన్ పోటీల్లో పాల్గొననున్న క్రీడాకారుడు ఎం.లింగారెడ్డి, జాతీయస్థాయి ఖోఖో క్రీడాకారులు ఇస్మాయిల్, శ్రీధర్ రెడ్డి, వెంకన్న, గోరె జాని, అంజయ్య, సోమ నరసయ్య, రహిమాన్, వినయ్, శేఖర్, కృష్ణను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఉప్పలయ్య, పీఈటీ వెంకటేశ్వర్లు, ముత్యాల వెంకన్న, వేణు, వేమన, దిలీప్, క్రీడాకారులు పాల్గొన్నారు.

కులగణన నిర్ణయం హర్షణీయం



కొత్తగూడ: మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

పెద్దవంగర: కేంద్ర ప్రభుత్వం కులగణన చేస్తామని తీసుకున్న నిర్ణయం హర్షణీయమని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రంగు రాములు గౌడ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో అంబేడ్కర్ చౌరస్తా వద్ద మండల అధ్యక్షుడు బొమ్మెరబోయిన సుధాకర్ ఆధ్వర్యంలో ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు తలారి సోమయ్య సురేష్ యాదవ్, శంకర్ పాల్గొన్నారు.

కొత్తగూడ: జనాభా లెక్కలతో పాటు కులగణన చేసేందుకు కేంద్రం ఆమోదం తెలిపినందుకు బీజేపీ నాయకులు శుక్రవారం మండల కేంద్రంలో ప్రధాని చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు యాదగిరి మురళీ, తోటకూరి మధు, ప్రవీణ్, నవీన్‌నాయక్, సారయ్య, యాకయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే బీసీలకు గుర్తింపు



మహబూబాబాద్ రూరల్: రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

మహబూబాబాద్ రూరల్: రాష్ట్రంలో బీసీలకు విద్య, ఉద్యోగ ఉపాధి రాజకీయ రంగంలో అవకాశాలు రావాలంటే అది కాంగ్రెస్ పార్టీతో సాధ్యమవుతుందని కాంగ్రెస్ అర్బన్ అధ్యక్షుడు ఘణపురపు అన్నారు. దేశ వ్యాప్త కులగణనకు పార్లమెంట్‌లో ఆమోదం తెలిపిన సందర్భంగా రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి జిల్లా కేంద్రంలోని మదర్ థెరిస్సా విగ్రహం వద్ద శుక్రవారం పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు రామదాసు, యాకుబ్, శ్రీనివాస్, చిరంజీవి, దేవ్ సింగ్, రాజమ్మ, సరస్వతి, రంజిత్, పాల్గొన్నారు.

గార్ల: గార్లలో శుక్రవారం కాంగ్రెస్ నాయకులు రాహుల్‌గాంధీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దనియాకుల రామారావు, సుందర్, నర్సయ్య, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

అకాల వర్షం.. అపార నష్టం

జిల్లాలో శుక్రవారం తెల్లవారుజామున అకస్మాత్తుగా వచ్చిన గాలివాన బీభత్సం సృష్టించింది. ఉరుములు, మెరుపులతోకూడిన భారీ వర్షం కురియడంతో చాలా గ్రామాల్లో రైతులకు, జనాలకు నష్టాన్ని మిగిల్చింది. రహదారిపై పలుచోట్ల భారీ వృక్షాలు నేల కూలి రోడ్డుకు అడ్డంగా పడ్డాయి. మామిడి తోటల్లోని మామిడి కాయలు నేలరాలిపోయాయి. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఆరబోసుకున్న వరిధాన్యం వర్షానికి తడిసిపోయింది. ఇంటిపై రేకులు ఎగిరిపోయాయి. విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. దీంతో పలుగ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. - సాక్షి నెట్‌వర్క్



కురవి: తడిసిన కాంటా అయిన ధాన్యం బస్తాలు, తడిసిన ధాన్యం



మహబూబాబాద్ రూరల్: పాతరెడ్యాలలో విరిగిపడిన భారీ చెట్టు



కురవి: సీరోలు మండలం కాంపల్లిలో గాలికి ఎగిరిపోయిన రేకుల ఇంట్లో చిన్నారులు



మహబూబాబాద్ రూరల్: కంబాలపల్లిలో తడిసిన ధాన్యాన్ని చూపిస్తున్న రైతు దంపతులు



డోర్నకల్: ముల్కలపల్లిలో కూలిన విద్యుత్ స్తంభం



గూడూరు: జగన్నాయకులగూడెంలో..



గార్ల: మద్దివంచలో రాలిన మామిడికాయల వద్ద రైతు



కురవి: కూలిపోయిన జామ చెట్లు

సంక్షిప్త సమాచారం

టార్పాలిన్‌లు అందుబాటులో ఉంచుకోవాలి

గూడూరు: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నిర్వాహకులు రాశులపై కప్పేందుకు టార్పాలిన్‌లు అందుబాటులో ఉంచుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఎండి.అబ్దుల్‌మాలిక్ అన్నారు. మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ఆయన సందర్శించారు.

రైతులను ఆదుకోవాలి

డోర్నకల్: భారీవర్షాలతో పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి శెట్టి వెంకన్న కోరారు. రైతులను ఆదుకోవాలని కోరుతూ శుక్రవారం రైతు సంఘం, సీపీఎం ఆధ్వర్యంలో తహసీల్దార్ కృష్ణవేణికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో బొబ్బ వెంకటరెడ్డి, శ్రీనివాస్, బొమ్మన అశోక్ కుమార్, దాసరి మల్లేశం, నవాబ్, తదితరులు పాల్గొన్నారు.

పట్టాభిషేకానికి ఆహ్వానం

కురవి: మండలంలోని తిర్మలాపురం గ్రామానికి చెందిన వాస్తు సిద్ధాంతి, జ్యోతిష్య నిపుణుడు, రచయిత బొల్లోజు భరత్‌ఉపేంద్రాచార్యులకు ఈనెల 8వ తేదీన హైదరాబాద్‌లోని త్యాగరాయ గానసభలో జరుగు తెలుగు భాషకు పట్టాభిషేకం కార్యక్రమానికి ఆహ్వానం అందినట్లు భరత్ శుక్రవారం తెలిపారు.

నేడు నీటి సరఫరా బంద్

మహబూబాబాద్: జిల్లా కేంద్రంలోని నందన గార్డెన్ సమీపంలో ఉన్న మిషన్ భగీరథ ప్రధాన పైపులైన్ రైల్వే క్రాసింగ్ వద్ద లీకేజీ కారణంగా నేడు కొత్త బజార్‌కు నీటి సరఫరా బంద్ చేస్తున్నట్లు మున్సిపల్ అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

కాట్రపల్లిలో బడిబాట

కేసముద్రం: మండలంలోని కాట్రపల్లి జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం వీరభద్రయ్య ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. అనంతరం పదిలో ఫస్ట్ ర్యాంకు సాధించిన బానోత్ దీపికను పీసీసీ సభ్యుడు గుగులోతు దస్రూనాయక్ తోపాటు, గ్రామస్తులు సన్మానించారు.

అండగా ఉంటాం..

తొర్రూరు రూరల్: కార్యకర్తలకు ఎలాంటి ఆపద వచ్చిన అండగా ఉంటామని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు హామీ ఇచ్చారు. శుక్రవారం మండలంలోని గుర్తూరు, తొర్రూరు గ్రామాల్లో పలు బాధిత కుటుంబాలను పరామర్శించి, ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో నాయకులు మంగళపెల్లి శ్రీనివాస్, రామిని శ్రీను, నలమాస ప్రమోద్, అనుమాండ్ల ప్రదీప్‌రెడ్డి, ఎన్నమనేని శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

ధాన్యం పరిశీలన

మహబూబాబాద్ రూరల్: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు తిప్పలు తప్పడంలేదని సీపీఐ మండల కార్యదర్శి తండ సందీప్ అన్నారు. మండలంలోని ముడుపుగల్ గ్రామంలో గల ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం సందర్శించి తండ సందీప్ మాట్లాడారు. తక్షణమే కొనుగోలు కేంద్రంలోని ప్రతీ గింజను ఎటువంటి కొర్రీలు లేకుండా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశాడు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

డోర్నకల్: డోర్నకల్ మున్సిపాలిటీ పరిధిలోని సిగ్నల్‌తండా సమీపంలోని రైల్వేశాఖకు చెందిన స్థలంలో నిల్వ చేసిన ఇసుకను చోరీ చేస్తుండగా గురువారం అర్ధరాత్రి ఆర్‌పీఎఫ్ పోలీసులు పట్టుకున్నారు. సీతారామా ప్రాజెక్ట్ పనులు నిర్వహిస్తున్న కాంట్రాక్టర్ సిగ్నల్‌తండా సమీపంలోని రైల్వే స్థలంలో పెద్ద ఎత్తున ఇసుకను నిల్వ చేశాడు. గత కొద్ది రోజులుగా ఇసుక చోరీకి గురవుతున్నట్లు అనుమానించి కాంట్రాక్టర్‌కు చెందిన సిబ్బందితో పాటు ఆర్పీఎఫ్ పోలీసులు గురువారం అర్ధరాత్రి సిగ్నల్‌తండా సమీపంలో తనిఖీలు నిర్వహించి ఇసుక లోడుతో వెళ్తున్న ట్రాక్టర్‌తో పాటు రెండు ద్విచక్రవాహనాలను పట్టుకుని రైల్వే స్టేషన్ ఆవరణకు తరలించారు.

విద్యార్థులకు సన్మానం

నెల్లికుదురు: ఇటీవలే ప్రభుత్వం విడుదల చేసిన పదో తరగతి పరీక్షా ఫలితాల్లో టాపర్లుగా నిలిచిన మండలంలోని ఆలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులను శుక్రవారం శాలువాలతో ఘనంగా సన్మానించిన ట్లు ఎంఈఓ రాందాస్ తెలిపారు. పాఠశాల వంద శాతం ఉత్తీర్ణత సాధించి మండల టాపర్లుగా నిలిచినట్లు తెలిపారు.

విద్యార్థులకు అభినందనలు

మరిపెడ రూరల్: మరిపెడ మండలం వీరారం జెడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించారు. మండలంలోని తెలుగు మీడియం విభాగంలో అత్యుత్తమ మార్కులు సాధించిన జి.శ్రీకాంత్ (525), ఎం.నవీన్ బాబు(502)లను శుక్రవారం అభినందించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్ఎం శ్రీరామగిరి మధు, ఉపాధ్యాయులు వెంకట్, మచ్చర్ల రవి, అనిల్, వెంకన్న పాల్గొన్నారు.

ధాన్యం తరలించాలి

కురవి: రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా త్వరతగతిన ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని మరిపెడ ఆత్మకమిటీ చైర్మన్ నల్లు సుధాకర్ రెడ్డి అధికారులకు సూచించారు. శుక్రవారం భారీ వర్షం కురియడంతో కురవిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించి పరిశీలించారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి కరణం రాజన్న, తురక రమేష్, బుర్ర సమ్మయ్య, నర్సింగం గుర్వయ్య పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

డోర్నకల్: దానాలన్నింటిలో అత్యున్నతమైన దానం అవయవదానమని తెలంగాణ నేత్ర, శరీర అవయవ దాతల సంఘం కార్యదర్శి డాక్టర్ పరికిపండ్ల అశోక్ తెలిపారు. సీరోలు మండలం మన్నెగూడెం ప్రభుత్వ పాఠశాల ఆవరణలో అవయవ దానాల ప్రాముఖ్యతను వివరించే కరపత్రాలను డాక్టర్ అశోక్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ ఆడెపు రాజేంద్రప్రసాద్, నాగేశ్వర్‌రావు, లక్ష్మణ్, శ్రావణ్, దామోదర్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

మానుకోటలో నెల్లూరు వాసి మృతి

మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలో నెల్లూరు జిల్లాకు చెందిన వ్యక్తి మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు జిల్లా సంగం మండలం కొరిమెర్ల గ్రామానికి చెందిన బండారి కోటి (38) రెండేళ్ల క్రితం మహబూబాబాద్ జిల్లాకు వచ్చాడు. ఈ క్రమంలో జిల్లాలోని నర్సింహులపేట మండలం రూప్లాతండా ప్రాంతంలో తాపీమేస్త్రీగా పనిచేస్తూ అక్కడే ఉంటున్నాడు. ఏప్రిల్ 30వ తేదీన అనారోగ్యానికి గురికాగా మహబూబాబాద్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి చికిత్స కోసం వచ్చాడు. వైద్యులు అతడికి చికిత్స అందించగా అక్కడే అదే రోజు రాత్రి మృతిచెందాడు. మృతుడి వద్ద గల సెల్ ఫోన్ ఆధారంగా అతడి బాబాయ్ కుమారుడు కుంచాల శ్రీనివాస్‌కు సమాచారం ఇచ్చారు. టౌన్ ఎస్సై అలీమ్ హుస్సేన్ కేసు నమోదు చేయగా హెడ్ కానిస్టేబుల్ లక్ష్మయ్య శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

గడ్డిమందు తాగి వ్యక్తి ఆత్మహత్య

డోర్నకల్: మండలంలోని ముల్కలపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై వంశీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన షేక్ రసూల్(24) కొద్ది రోజులుగా నిరుత్సాహంగా ఉంటూ గురువారం వ్యవసాయ భూమి వద్ద గడ్డిమందు తాగు ఫోన్ ద్వారా తన సోదరుడికి తెలిపాడు. వెంటనే స్పందించిన సోదరుడు రసూల్‌ను 108 వాహనం ద్వారా ఖమ్మంలోని ఓ ఆసుపత్రికి తరలించాడు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడి తండ్రి చినసైదులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కారు, బైక్ ఢీ.. ఇద్దరికి గాయాలు

గార్ల: బయ్యారం నుంచి వెంకన్న, మరో వ్యక్తి కలిసి బైక్‌పై ఖమ్మం వెళ్తుండగా గార్ల సమీపంలో మలుపు వద్ద ఎదురుగా వస్తున్న కారు బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో వెంకన్న కాలు విరగడంతో 108 వాహనంలో మహబూబాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు సిబ్బంది రవి, ప్రశాంత్ తెలిపారు. బైక్ వెనుక కూర్చున్న మరో వ్యక్తికి స్వల్ప గాయాలైనట్లు వారు పేర్కొన్నారు.

ఒకరిపై కేసు నమోదు

దంతాలపల్లి: మండలంలో ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పిల్లల రాజు శుక్రవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలప్రకారం.. సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం ఏనకుంట తండాకు చెందిన బానోత్ రమేశ్ ద్విచక్రవాహనంపై భార్య సునీతతో పెద్దముప్పారం గ్రామానికి గురువారం సాయంత్రం వచ్చారు. ఈ క్రమంలో పెద్దముప్పారం గ్రామానికి చెందిన పెల్లి దామోదర్ రెడ్డి పామాయిల్ తోటలో గెలలు కోయడానికి ఉపయోగించే బరిసెలు రెండింటిని తన స్కూటీకీ వెనుక కట్టుకొని వస్తున్నాడు. గ్రామంలోకి రాగానే దామోదర్‌రెడ్డి ఒక్కసారి తన స్కూటీ బ్రేక్ వేయడంతో ఎదురుగా వస్తున్న కత్తులు రమేశ్ (40)గొంతులో బరిసె కుచ్చుకుపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య సునీత ఇచ్చిన ఫిర్యాదు మేరకు దామోదర్ రెడ్డిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు.